తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త





# రోజు రోజుకు మామిడి ధరలు పతనం

## - తోతాపురి టన్ను ధర రూ.21 వేలు



మార్కెట్ యార్డులో అమ్మకానికి సిద్ధంగా వున్న మామిడి కాయలు

బంగారుపాళ్యం, జూన్ 29 ప్రభాతవార్త:

స్థానిక వ్యవసాయ మూర్కెట్ యార్డులో రోజు రోజుకు మామిడి ధరలు పతనం అవుతున్నాయి. మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు గగ్గోలు పెడ్తున్నప్పటికీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. శనివారం సాయంత్రం మార్కెట్ నందు తోతాపురి రకం మామిడి టన్ను రూ.21 వేలుకు పలికింది. గత పదిహేను రోజుల క్రితం తోతాపురి మామిడి రకం టన్ను రూ.29 వేలు పలికింది. ఆ మరుసటి రోజు నుండి తోతాపురి మామిడి ధరలు రోజు రోజుకు క్షీణిస్తూ వస్తున్నాయి. శుక్రవారం మార్కెట్ నందు టన్ను రూ.24 వేలు ధర పలుకగా కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే టన్నుపై 3 వేల రూపాయలు తగ్గింది. ఈ విధంగా రోజువారీగా ధరలు తగ్గుతూ పోతుండటంతో రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో మామిడి దిగుబడి లేకపోవడంతో ధరలు ఓ మోస్తారుగా వుంటాయని రైతులు భావించారు. అదే రీతిలో మామిడి వ్యాపారులు సైతం అధిక మొత్తం వెచ్చించి మామిడి తోటలను కొనుగోలు చేశారు. అయితే మామిడి ధరలు రోజు రోజుకు పతనం అవుతుండటంతో అటు రైతులు, ఇటు వ్యాపారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తున్నది. కలెక్టర్ తోతాపురి మామిడి టన్ను రూ.30 వేలు తగ్గకుండా కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసి వున్నప్పటికీ ఆ ఆదేశాలు బేఖతారు చేస్తూ వ్యాపారాలు సాగుతున్నాయి. మామిడి గుజ్జు పరిశ్రమ యాజమానులు సిండికేట్ కావడం వల్లే ధరలు పతనం అవుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. మరోవైపు కర్నాటక రాష్ట్రం నుండి అధిక మొత్తంలో మామిడి దిగుబడిని గుజ్జు పరిశ్రమ యాజమానులు దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో మేము నిర్ణయించిన ధరకే కాయలు కొనుగోలు చేస్తామని గుజ్జు పరిశ్రమ యాజమానులు హుకుం జారీ చేస్తున్నారు. పరిపక్వంకు వచ్చిన మామిడి కాయలను తోటలో నిల్వ వుంచలేక రైతులు తక్కువ ధరకే అమ్మకాలు సాగిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం మామిడి రైతును ఆదుకొని కనీస మద్దతు ధర చెల్లించాలని కోరుతున్నారు.

# 1వ తేదీ వంద శాతం పెన్షన్ల పంపిణీ



చిత్తూరు, జూన్ 29 ప్రభాతవార్త:

జులై 1వ తేదీ నాటికే పెన్షన్ల పంపిణీ కార్యక్రమం వంద శాతం పూర్తి కావాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను సత్వరం చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీపై శనివారం వెలగపూడి సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాలు నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ కలెక్టర్లు, డిఆర్‌డిఎ పిడిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి అన్ని విధాలా సిద్ధంగా వున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి జులై నెల 1వ తేదీ పెన్షన్ల పంపిణీకి అన్ని విధాలా సన్నద్ధంగా వుండాలన్నారు. జులై 1వ తేదీ ఉదయం 6 గంటల నుండి జిల్లాలో కచ్చితంగా పెన్షన్ల పంపిణీ ప్రారంభం అయ్యేలా ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలన్నారు.

# దొరువు నీరే గిరిజనులకు దిక్కు!

## గొల్లలనట్టు గిరిజన కాలనీలో క'న్నీటి' కష్టాలు
## అరకొర నీటితో గిరిజనుల అవస్థలు
## కాలనీ వాసుల గోడు పట్టని అధికారులు, పాలకులు



దొరువు నీటిని తీసుకెళుతున్న గిరిజనులు

చిట్టమూరు, జూన్ 29 ప్రభాతవార్త

అనాదిగా తాగునీటి కోసం తీరప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల పలు గ్రామాలకు ప్రభుత్వం తాగునీరు కూడా అందించలేకపోతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గిరిజన కాలనీలలో మౌలిక వసతులతో పాటు ప్రధాన అవసరమైన తాగునీటి పంపిణీలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తుండటంతో గిరిజనులు తాగునీటి కోసం కన్నీటి పర్యంతమవుతున్నారు. తాజాగా ఎల్లూరు పంచాయతీ పరిధిలోని గొల్లలనట్టు గ్రామంలో 30 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. వాకాడులోని స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతం నుంచి పైపులైన్ల ద్వారా ఎల్లూరు గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు తాగునీరు సరఫరా అవుతుంది. ఈ ట్యాంకు ద్వారా గొల్లలనట్టు గిరిజన కాలనీకి కూడా నీటి సరఫరా కావాల్సి ఉంది. అయితే గ్రామంలో ప్రతి ఇంటికి జెట్ మోటార్లు అమర్చుకోవడంతో పైన ఉన్న గిరిజన కాలనీకి తాగునీరు అందడం లేదు. ఒకవేళ గిరిజనులపై దయచూపి ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి నీరు వదిలినా వారానికి ఒకసారి అరకొర నీరు చేరుతుంది. దీంతో ప్రజల దాహార్తి తీరకపోగా మరిన్ని కష్టాలు తప్పడంలేదు.



సంప్ వద్ద పడిగాపులు

ఎన్నికల సమయంలో కాలనీ వాసులకు కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు వేయించుకునే రాజకీయ పార్టీలు, నాయకులు... ఆ తర్వాత మమ్మల్ని మోసం చేస్తున్నారని కాలనీకి చెందిన పెద్దలు సుందరరామయ్య, పోలయ్య, మునెయ్య, మొలకల అంకయ్య, చెంబేటి బుజ్జమ్మ తదితరులు శనివారం 'ప్రభాతవార్త'తో తమ ఆవేదన పంచుకున్నారు.

**కాలనీ సమీపంలో గేట్‌వాల్వ్ నిర్మించండి మహాప్రభో..**

స్వర్ణముఖి నది నుంచి తమ కాలనీ మీదుగా ఎల్లూరుకు సరఫరా అవుతున్న తాగునీటి పైపులైన్‌కు గిరిజన కాలనీ సమీపంలోనే గేట్‌వాల్వ్ నిర్మించాలని గిరిజనులు అధికారులతో మొరపెట్టుకుంటున్నారు. గిరిజన కాలనీ ప్రాంతంలోనే గేట్‌వాల్వ్ ఏర్పాటు చేసే అర్ధగంటలో తమ కాలనీకి తాగునీరు అంది తాము గొంతు గడుపుకుంటామని వారు చెప్తున్నారు.

**దొరువు నీరే గిరిజనులకు దిక్కు..**

గొల్లలనట్టు గ్రామంలోని సుమారు 30 కుటుంబాలకు ప్రస్తుతం దొరువు నీరే పెద్దదిక్కుగా మారింది. గ్రామానికి తాగునీటి సరఫరా మొక్కుబడిగా రావడం, ఒక వేళ నాలుగురోజులకోసారి వచ్చినా ఆ నీరు గొంతు తడుపుకునేందుకు కూడా చాలడం లేదని వారు వాపోతున్నారు. దీంతో గిరిజనులు ఆ కాలనీ సమీపంలో ఉన్న కలుషితమైన దొరువు నీటినే వ్యక్తిగత అవసరాలకు ఉపయోగిస్తున్నారు. దీంతో పలు చర్మవ్యాధులు ప్రబలుతున్నాయని గిరిజనులు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఈ దొరువు నీటితోనే ప్రస్తుతం పశువులు కూడా తాగుతుండటంతో గిరిజనులు చేసేది లేక ఆ నీటినే ఉపయోగించాల్సి వస్తోంది. పాలకులు, అధికారులు స్పందించి తక్షణం గొలల్లనట్టు గిరిజన కాలనీకి తాగునీటి వసతి కల్పించి ఆదుకోవడంతో పాటు ప్రజలు కలుషిత నీరు తాగి రోగాల బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# మరింత నాణ్యతగా 'లడ్డూప్రసాదం'

## -ప్రయోగాత్మకంగా రుచికరంగా తయారీ



తిరుమల, జూన్ 29ప్రభాతవార్తప్రతినిధి:

కలియుగప్రత్యక్షదైవమ్ వేంకటేశ్వరస్వామి దర్శనమ్ తరువాత అంతటి పవిత్రమైన లడ్డూప్రసాదాలను నాణ్యతగా, రుచిగా తయారుచేయించేందుకు టిటిడి ఈఓ జె.శ్యామలరావు కార్యాచరణ రూపొందించారు. లడ్డూప్రసాదాలు మరింత రుచిగా, నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని , ఇందుకు మరింత నాణ్యమైన నెయ్యిని కొనుగోలుచేయాలని, కొనుగోలు చేసిన నెయ్యిని ప్రస్తుతం పరీక్షిస్తున్న విధంగా గాకుండా మరింత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా పరీక్షించాలి తదితర అంశాలపై ,తీసుకోవాల్సిన మార్పులను తెలియజేయాలని నిపుణులను కోరారు.ఒక్కో లడ్డూ 50 రూపాయలు వెచ్చిస్తున్నా రుచికరంగా, నాణ్యత లేకపోతోందనేది భక్తుల ఆరోపణలు.ఈ నేపథ్యంలో టిటిడి ఈఓగా శ్యామలరావు బాధ్యతలు చేపట్టిన తరువాత స్వామివారి లడ్డూప్రసాదం, అన్నప్రసాదాల తయారీపై ప్రత్యేక దృష్టి సారించారు. లడ్డూల తయారీలో నాణ్యతగా ఉన్న ముడిపదార్థాలు నెయ్యి, శనగపిండి, యాలకులు, జీడిపప్పు,ఎండుద్రాక్ష, కుంకుమపువ్వు వినియోగించేలా చూస్తున్నారు. లడ్డూలు నాణ్యత మరింత పెంచి రుచికరంగా ఉండేలా భక్తులకు అందనున్నాయి.అలాగే టిటిడి సేవలకు ఆధార్‌కార్డు అనుసంధానం చేసి మరింత పారదర్శకంగా సేవలందించేలా చూడనున్నారు. ఈ సమావేశంలో యుఐడిఎఐ డిప్యూటీ డైరెక్టర్ సంగీత, అధికారులు శ్రీనివాస్, రాజశ్రీ గోపాలకృష్ణ, అనుకూరచౌదరి, సంజీవ్‌యాదవ్, టిటిడి జెఈఓలు వీరబ్రహ్మం, గౌతమి , సివిఎస్ఓ నరసింహకిశోర్, జిఎం శేషారెడ్డి,సిపిఆర్ఓ డాక్టర్‌తలారి రవి పాల్గొన్నారు.

# ఘనంగా కోటమ్మ గ్రామోత్సవ వేడుకలు



కోట, జూన్ 29 ప్రభాతవార్త

కోటలో వెలసిన కోటమ్మ తల్లి గ్రామోత్సవ వేడుకలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి నివాసం నుంచి వందలాది మంది భక్తులు పూలబుట్టలతో సారె కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి సారె కార్యక్రమంలో పాల్గొనేందుకు గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విచ్చేశారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌లకు ఆలయ అర్చకులు మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. మంగళ వాయిద్యాలు, బాణాసంచా వేడుకలతో గ్రామోత్సవాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ఏర్పాట్లు పరిశీలించారు. వేడుకల్లో పాల్గొనేందుకు వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్లకూరు దశరథరామిరెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డి, సర్వోత్తమరెడ్డి, జలీల్ అహ్మద్, వెంకన్నపాలెం సర్పంచ్ మధుసూదన్ యాదవ్, తీగల సురేష్‌బాబు, నెల్లూరు మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కందల బాలకృష్ణ యాదవ్, గుర్రం అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ శారదా పీఠాన్ని తక్షణమే సీజ్ చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ సభ్యులు

తిరుపతి హెల్త్, జూన్ 29, ప్రభాతవార్త

తిరుమలలో విశాఖ శారదా పీఠాన్ని తక్షణమే సీజ్ చేయాలని, టిటిడి నియమ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి మంచి ఎక్కువ ఎత్తులో అక్రమ కట్టడాలను కట్టడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ సభ్యులు పేర్కొన్నారు. అంతే కాకుండా ఆ భవనానికి వెనుక వైపు వాగును కూడా కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేశారు. ఈ భవనంలో భక్తుల భద్రత గాల్లో దీపమే కాబట్టి విశ్వాఖ శారదా పీఠాన్ని తక్షణమే సీజ్ చేసి టిడిపి స్వాధీనం చేసుకోవాలన్నారు. తిరుమలతో విశాఖ శారదా పీఠం పీఠాధిపతి ప్రియ శిష్యుడు, విశాఖ శారదా పీఠం అక్రమ నిర్మాణాల నిర్మాత అయిన రవీంద్ర బాబు ఒక్కడే తిరుమలలో 5 మఠాలను తన గుప్పెట్లో పెట్టుకుని భక్తులను నిలువ దోపిడీ చేస్తున్నారు. రవీంద్రబాబు ఒక్క దళారిగా తిరఉమలలో తన జీవితాన్ని ప్రారంభించి 100ల కోట్ల రూపాయిలు ఎలా సంపాదించారన్నారు. తిరుమలలో మ్యారేజ్ కాంట్రాక్టర్లు అయిన జిఎంకె రాఘవేంద్ర, రామారావులు పెళ్లిళ్ల పేరుతో హిందువులు సెంటిమెంట్ అడ్డు పెట్టుకుని కోట్లాది రూపాయిలను భక్తుల నుంచి దోచేస్తున్నారన్నారు. తిరుమలలో స్వామి వారికి చెందాల్సిన సొమ్ము ప్రైవేట్ వ్యక్తులు జోబిలోకి వెళుతున్నది అసలకి తిరుమలలో ఉన్న 80 శాతం మఠాలు కొన్ని ముఠాలుగా ఏర్పడి భక్తులను పెళ్ళిల పేరుతో దోపిడి చేస్తున్నాయన్నారు. తిరుమలలో ఉన్న మఠాలను టిడిపి ప్రక్షాళన చేయాలి మఠాలలో భజనలు, భక్తి కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు, ఉచిత వసతి సౌకర్యాలు కల్పించి విధంగా టిటిడి చర్యలు తీసుకోవాలన్నారు.

# మామిడి తోటలపై ఒంటరి ఏనుగు దాడి



బంగారుపాళ్యం, జూన్ 29 ప్రభాతవార్త:

మండలంలోని గోవర్ధనగిరి సమీపంలోని మామిడి తోటలపై శుక్రవారం రాత్రి ఒంటరి ఏనుగు దాడి చేసింది. ఈ దాడిలో భారీగా మామిడికి నష్టం వాటిల్లింది. రైతు సుదర్శన్ నాయుడుకు చెందిన మామిడి తోటలోకి సమీప అటవీ ప్రాంతం నుండి ఒంటరి ఏనుగు వచ్చి తోటలోని నీళ్ళ డ్రమ్మును ధ్వంసం చేసింది. మామిడి చెట్ల కొమ్మలను విరిచివేసి కాయలను తినింది. మామిడి ధరలు అంతంత మాత్రమే వున్న సమయంలో వున్న కొద్దిపాటి పంటను సైతం ఏనుగు దాడి చేసి ధ్వంసం చేసిందని రైతు వాపోయాడు. ఈ మేరకు అటవీశాఖ అధికారులు జరిగిన పంట నష్టంను పరిశీలించారు.

# ఇవిఎం, వివిప్యాట్లకు పటిష్ట భద్రత - కలెక్టర్

## - కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు, జూన్ 29 ప్రభాతవార్త:



కలెక్టరేట్ లోని ఇవిఎం, వివిప్యాట్ల గోదాములకు పటిష్ట భద్రత కల్పించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం కలెక్టరేట్‌లోని ఇవిఎం గోడౌన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలక్షన్ కమీషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇవిఎం, వివిప్యాట్ల భద్రతకు చేసిన ఏర్పాట్లను కలెక్టర్ క్షుణ్ణంగా తనిఖీ చేసి సిసి కెమెరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల మేరకు ఎప్పటికప్పుడు ఇవిఎం, వివిప్యాట్ల గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పించనున్నట్లు తెలిపారు. అలాగే మూడు నెలలకు ఒకసారి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎం, వివిప్యాట్లను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గోదామును త్రైమాసిక తనిఖీల్లో భాగంగా నిశితంగా పరిశీలిచడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య, కాంగ్రెస్ ప్రతినిధి పరదేశి, తెలుగుదేశం ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్, బిజెపి ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, వైకాపా ప్రతినిధి ఉదయ్‌కుమార్, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# టెండర్ల మాయాజాలం!

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో రెండేళ్ళుగా పార్కింగ్‌కు రాని కాంట్రాక్టర్లు

**శ్రీకాళహస్తీశ్వరాలయంలో లీజు టెండర్ల విధానాలు ప్రహసనంగా మారింది. గతంలో టెండర్లు విదానం భ్రష్టుపట్టింది. అధికార పార్టీ నాయకుల ఆదేశాలే శిరోధార్యంగా సాగాయి.నామమాత్రపు టెండర్లుతో అస్మదీయులకు కట్టబెట్టారు. దాంతో శివయ్య ఆదాయాలకు శఠగోపం పడింది.ఈ నేపథ్యంలో కార్‌పార్కింగ్‌కు సంబంధించిన టెండర్ రెండు సార్లు పిలిచినా ఎవరూ రాక పోవటంతో దేవస్థానమే నిర్వహిస్తుంది. వేలం పాటల సమయంలో అధికారులు కనీసం రూ.1.5కోట్లు రావాలని భావిం చారు. కానీ ఇక్కడి అధికార పార్టీ నాయకులు సిండికేట్‌గా మారి రూ.99లక్షలకే సరిపెట్టుకోవాలని భావించారు. దేవస్థానం అంగీకరించలేదు.ఏడు నెలలకే దేవస్థానం మొక్కుబడిగా వసూలు చేసినా రూ.కోటి దాటింది. ఇతర టెండర్ల వ్యవహారం అలాగే ఉంది.**

శ్రీకాళహస్తి, జూన్ 29 ప్రభాతవార్త





సాధారణంగా ఎక్కడైనా ఏ శాఖలో అయినా టెండర్ల వ్యవహారాలు మార్చి మొదటి వారంలో నిర్వహించి ఏప్రిల్ 1నుంచి కాంట్రాక్టర్లకు అప్పగించటం అనేది సాధారణంగా జరిగే వ్యవహారం. అయితే శ్రీకాళహస్తీశ్వ రాలయంలో మాత్రం అక్టోబర్,నవంబర్‌లలో టెండర్లు నిర్వహించే సరికొత్త సంస్కృతి చోటు చేసుకుంది.ఇక్కడ టెండర్ల వ్యవహారం ప్రహసనంగా మారింది.ఎప్పుడు టెండర్లు పిలుస్తారో? అవి ఆమోదించబడతాయో? లేదో తెలియని స్థితి చోటు చేసుకుంటుంది. ఒక సారి ఇక్కడి టెండర్ల వ్యవహారం పరిశీలిస్తే కార్‌పార్కింగ్‌ను దేవస్థానమే నిర్వహిస్తుంది.ఈ టెండర్లు గత ఏడాది నవంబర్‌నాటికి పూర్తి అయ్యింది. దేవస్థానం అధికారులు రెండు సార్లు టెండర్లు పిలిచింది. కాంట్రాక్టర్లు రింగ్ అయ్యారు.దాంతో దేవస్థానమే కార్‌పార్కింగ్‌ను నిర్వహిస్తుంది. దేవాదాయశాఖ టెండర్ల విధానంలో కనీసం ఏడాదికి రూ.1.2 నుంచి 1.5కోట్లు రావాలని భావించింది. కానీ అలా కుదరలేదు.కారణం అధికార పార్టీ జోక్యంతో కాంట్రాక్టర్లుముందుకు రాలేదు. అధికార పార్టీలోనే పోటీలు పడేవారు.దాంతో దేవస్థానమే వసూలు చేస్తూ కొందరు పార్టీ కార్యకర్తలకు ఇక్కడ ఉపాధి కల్పించారు. దేవస్థానం నవంబర్ నుంచి వసూలు చేస్తుంది, ఆర్నెలకు రూ.కోటి వసూళ్ళు దాటింది. ఇక ఫలసరకుల టెండర్లు జరగాల్సి ఉంది. విచ్చల విడిగా దేవస్థానం ఆదాయ వనరుగా మలచుకున్నారు.దాంతో బయటి వారు వచ్చే వారు కాదు. 2019కి పూర్వం పరిస్థితి పరిశీలిస్తే ఇక్కడ టెండర్లకు కాంట్రాక్టర్లు పోటీలు పడే వారు. దేవస్థానం ఆదాయాలు బాగా పెరిగేవి.అధికార పార్టీ జోక్యంతో టెండర్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.ప్రస్తుతంకొత్త పాలకులు మరి వీరి ఆలోచనలేమిటో వేచి చూడాలి. ప్రస్తుతం ఓసారి కార్‌పార్కింగ్ టెండర్‌ను నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు.ఇక సెల్ ఫోన్ల టెండర్ నడుస్తుంది. దీని ద్వారా దేవస్థానంకు రూ.1.03కోట్లు ఆదాయం వచ్చింది. సెక్యూరిటీ సిబ్బంది సరఫరాకు సంబంధించి టెండర్లు పిలిచారు. రెండు టెండర్లు దాఖలయ్యాయి,కాని రెండూ అర్హత పొందలేదు.దాంతో రీటెండర్లకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఫల సరకుల టెండర్ నిర్వహించాల్సి ఉంది. మరి ప్రస్తుత ప్రభుత్వ విధి విధానాలేమిటో తెలియదు.దేవాదాయశాఖలో టెండర్ల వ్యవస్థను సంస్కరించాల్సి ఉంది.

# రెస్కోలో అవకతవకలపై విచారణకు రంగం సిద్ధం

## - నిబంధనలు బేఖాతరు చేశారని జాయింట్ కలెక్టర్ నిర్ధారణ !!
## - త్వరలోనే అధికారుల రాక.. సమగ్ర దర్యాప్తుపై ప్రభుత్వానికి నివేదిక !!

కుప్పం, జూన్ 29 ప్రభాతవార్త

కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో)లో చోటు చేసుకున్న అవకతవకలు, అక్రమ నియామకాలపై విచారణకు రంగం సిద్ధమైంది. కుప్పం రెస్కో పర్సన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు రెస్కో స్థితిగతులు, సంస్థ పరిధిలో చేపట్టిన విద్యుత్ పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోళ్లు, సంస్థ ఆర్థిక లావాదేవీలు, అప్పులు, రావాల్సిన బకాయిలు, ఉద్యోగ నియామకాలు తదితరాలపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రెస్కో పరిధిలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, గత ఐదేళ్ల కాలంలో చేపట్టిన ఉద్యోగ నియామకాలు నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్లు జాయింట్ కలెక్టర్ నిర్ధారించారు. రెస్కోలో చోటు చేసుకున్న అంశాలపై పూర్తి స్థాయి విచారణకు అధికారులను నియమించనున్నారు. త్వరలో రెస్కోలో జరిగిన అవకతవకలపై విచారణకు అధికారులు రానున్నారు. ఇటీవలే ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ కుప్పం రెస్కోలో జరిగిన అవినీతి, అక్రమాలపై సిబిసిఐడి విచారణ చేయిస్తామని, ఈవ్యవహారంలో ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తుమ్మిశికి చెందిన నగేష్ అనే వ్యక్తి ఫిర్యాదుతో 19మందిని రెస్కోలో అక్రమంగా ఉద్యోగాల్లో నియమించారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈనెల 14వతేది అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆనందం కుప్పం రెస్కో కార్యాలయంకు చేరుకుని ఉద్యోగ నియామకాలపై విచారణ చేపట్టారు. అయితే సంబంధిత విచారణాధికారి బంధువు సైతం రెస్కోలో ఉద్యోగం చేస్తున్నారనే ఆరోపణలు సైతం రావడంతో ఈ అంశంగా విచారణ అధికారిని మార్చారు. శుక్రవారం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కుమార్ విచారణ చేపట్టారు. కాగా ఐదేళ్ల కాలంలో కుప్పం రెస్కో పరిధిలో లెక్కకు మించి దాదాపు 100కుపైగా యువతీయువకులకు రెస్కోలో వివిధ పోస్టులకు సంబంధించి కొలువుల్లో నియమించారు. అయితే అప్పటి పాలకులు, అధికారులు ఈ నియామకాలు నియమ నిబంధనలకు లోబడి కాకుండా ఇష్టారాజ్యంగా చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ నిర్ధారించారు.అలాగే విద్యుత్ పరికరాల కొనుగోళ్లలో సైతం గోల్‌మాల్ జరిగిందని ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఈ అంశాలపై సమగ్రంగా విచారించేందుకు త్వరలో అధికారులు రానుండడంతో కుప్పం రెస్కోలో ఏమేర అవకతవకలు, అక్రమాలు చోటు చేసుకున్నాయో వెలుగు చూసే అవకాశం ఉంది.



# జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయం

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు**

చిత్తూరు, జూన్ 29 ప్రభాతవార్త: జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలు ఉచిత న్యాయం పొందచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.బీమారావు పేర్కొన్నారు. జిల్లా కోర్టు నందు శనివారం ఫోక్సో కోర్టు జిల్లా జడ్జి శాంతి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, అదనపు సివిల్ జడ్జి ఎస్‌పిడి వెన్నెల, చిత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్రరెడ్డి, కార్యదర్శి అశోక్ ఆనంద్‌యాదవ్, విశ్రాంత జడ్జి రమేష్‌లతో కలసి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు మాట్లాడుతూ నిర్లక్ష్యం, కోపతాపాలు ఏ ఒక్క కుటుంబంలో వుండకూడదని, ప్రతి కుటుంబంలో ప్రేమ, నమ్మకం మాత్రమే వుండాలన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు, రాష్ట్ర హైకోర్టు సూచనల మేరకు శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంను నిర్వహిస్తున్నా మన్నారు. రాజ్యాంగం ప్రజలకు కల్పిస్తున్న సమన్యాయం, సామాజిక న్యాయం, సత్వర న్యాయం కోసం సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో కక్షిదారులకు సత్వర న్యాయం అందించడానికి లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుం దన్నారు. జాతీయ లోక్‌అదాలత్ యొక్క ముఖ్య ఉద్దేశం మూములుగా కోర్టుల్లో తీర్పు చెప్పినపుడు ఒకరు విజయం సాధిస్తే మరొకరు అపజయం పాలవుతారని, దీనికి విభిన్నమైన రీతిలో లోక్ అదాలత్‌లో కక్షిదారుల మధ్యర్తిత్వం ద్వారా మాట్లాడుకోవడంతో వివాదంను సున్నితంగా పరిష్కరించుకోవచ్చునన్నారు.



జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొని కేసులను పరిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

రాజమార్గంలో రాజీమార్గం ద్వారా కక్షిదారులు కేసులను పరిష్కరించు కోవచ్చునన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జిల్లా కేంద్రం చిత్తూరుతో పాటు 13 మండల న్యాయ సేవా అదికార సంస్థ ఆద్వర్యంలోని తిరుపతి, మదనపల్లి, శ్రీకాళహస్తి, పీలేరు, పుత్తూరు, పుంగనూరు, పలమనేరు, పాకాల, కుప్పం, వాల్మీకిపురం, సత్యవేడు, నగరి, తంబళ్ళపల్లి కోర్టుల్లో ఏర్పాటు చేసిన 34 బెంచ్‌ల ద్వారా కేసులను పరిష్కరించుకోవడానికి ముందుగానే 11,868 కేసులను గుర్తించడం జరిగిందన్నారు. ముందస్తుగా ప్రీ లోక్ అదాలత్ బెంచ్‌ల ద్వారా మధ్యవర్తిత్వం నిర్వహించి 233 కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. గత మార్చి నెలలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 760 క్రిమినల్ కాంపౌండబుల్, 41 ఎంఎసిటి కేసులు, 279 సివిల్ కేసులను పరిష్కరించి రూ.43.20 కోట్ల రూపాయలను కక్షిదారులకు అందించ డంతో పాటు మరో 91 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మాధవి, 3వ అదనపు సివిల్ జూనియర్ జడ్జి శ్రీనివాసు, 5వ అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ జె.కీర్తన, న్యాయవాదులు జి.వెంకటపతి నాయుడు, మంజువాణి, నీలిమ, బాలాజీ, ఝాన్సీ, జిల్లా న్యాయాధికారులు, జిల్లా న్యాయవాదులు, రెవెన్యూ, బ్యాంకు, పోలీసు అధికారులు, చిట్‌ఫండ్ కంపెనీ, భీమా సంస్థల ప్రతినిధులు, కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## కల్పవృక్షవాహనంపై అలరించిన కోదండరాముడు



తవణంపల్లె, జూన్ 29 ప్రభాతవార్త: మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో వెలసిన శ్రీకోదండరాముల వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీసీతా లక్ష్మణ సమేతుడైన కోదండరాముడు కోరిన వరాలిచ్చే కల్పవృక్షవాహనంపై గ్రామ పురవీధులలో విహరిస్తూ భక్తులను అలరించారు. ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా స్వామివారికి శనివారం కల్పవృక్షవాహన సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి దేవస్థానం వంశపారపర్యం ధర్మకర్త పి.సిద్ధేశ్వరరెడ్డి, టి.పుత్తూరుకు చెందిన పి.వెంకటరమణారెడ్డి అండ్ సన్స్ ఉభయదారులుగా వ్యవహరించారు. ఈసందర్భంగా ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం నిర్వహించగా సాయంత్రం ఊ ంజల్‌సేవ నిర్వహించారు. అలాగే రాత్రి శ్రీసీతా లక్ష్మణ సమేతంగా సర్వాలంకృతుడై వేదపండితుల మం త్రోచ్చారణ నడుమ అర్చక స్వాముల పూజలందుకున్న అనంతరం రంగురంగుల విద్యుద్దీపాలు, వివిధరకాల పరిమళ పుష్పాలతో భారీ ఎత్తున ఏర్పాటు చేసి దేదీవ్యమానంగా అలంకరించిన కల్పవృక్షవాహనంపై అధిరోహించి మంగళవాయిద్యాలు, పలురకాల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల నడుమ కాణిపాకం గ్రామ పురవీధులగుండా ఊరేగుతూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు.

## బోయకొండ గంగమ్మ హుండీ లెక్కింపు -రూ.1.16కోట్ల ఆదాయం

చౌడేపల్లె,జూన్29 ప్రభాతవార్త : శక్తి స్వరూపిణిబోయకొండ గంగమ్మ ఆలయంలోని హుండీలను శనివారం లెక్కించారు. ఈలెక్కింపు ద్వారా అమ్మవారి ఆలయానికి రూ.1.16,21,723 లు ఆదాయం వచ్చిందని ఈఓ చంద్రమౌళి తెలిపారు. 65 రోజులకు గాను హుండీ లెక్కింపులో నగదుతో పాటు 60 గ్రాముల బంగారం, ఒక కేజీ 220 గ్రాముల వెండిని భక్తులు అమ్మవారికి కానుకలుగా సమర్పించారన్నారు. అదేవిధంగా రణభేరి గంగమ్మ ఆలయంలోని హుండీ ద్వారా రూ.78,829లు ఆదాయంగా సమకూరిందన్నారు. వీటితో పాటు పలు విదేశీ కరెన్సిని భక్తులు సమర్పించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో గ్రూప్ టెంపుల్స్ ఈఓ మునిరాజ, ఆలయ, అదికార, అర్చక సిబ్బంది, పోలీసులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## బిఆర్‌డి ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

**- మహిళ కడుపునుంచి పది కిలోల కణతి తొలగింపు !!**

కుప్పం, జూన్ 29 ప్రభాతవార్త : కుప్పం పట్టణంలోని బిఆర్డీ మల్టీ స్పెషాలిటీ ఆస్ప త్రిలో అరుదైన శస్త్ర చికిత్సను వైద్య బృందం విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి డైరెక్టర్ డా॥ బిఆర్ సురేష్‌బాబు తెలిపారు. తమిళనాడు రాష్ట్రం కురుంబేరికి చెందిన పెన్నియమ్మన్ (56) తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స కోసం తమ ఆస్పత్రికి రావడం జరిగిందన్నారు. వైద్యులు ఆమెకు రక్తపరీక్షలు, స్కానింగ్ నిర్వహించి ఆమె కడుపులో కణతి ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డా॥ హరిత మండవ అధ్వర్యంలో పెన్నియమ్మన్‌కు ఆపరేషన్ నిర్వహించి కడుపులో ఉన్న పది కిలోల అండాశయ తిత్తిని విజయవంతంగా తొలగించినట్లు చెప్పారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. శస్త్రచికిత్సలో పాల్గొన్న డా॥ హరిత మండవ, డా॥ భవాని, ఓటి టెక్నీషియన్లు ధనశేఖర్, చంద్రశేఖర్, రంజిత్, దివాకర్, రోజాలను అభినందించారు.

## కేసుల వివరాల సేకరణలో కుప్పం తెలుగు తమ్ముళ్లు

**- సిఎం చంద్రబాబు ప్రకటనతో ఉత్సాహం !!**

కుప్పం, జూన్ 29 ప్రభాతవార్త : గత ఐదేళ్ల వైఎస్సార్సీ ప్రభుత్వ పాలనలో కుప్పం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులపై భారీగా పోలీసు కేసులు నమోదైన విషయం విదితమే. అప్పటి వైఎస్సార్సీ నేతల ప్రోద బ్బలంతో దేశం శ్రేణులపై లెక్కకు మించిన కేసులు నమోదయ్యాయి. కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, రాళ్లబూదుగూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కేసులనుపోలీసులు నమోదు చేశారు. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనకు విచ్చేసిన సందర్భంగా జిఓ నెం 1అమలులో ఉందని చెప్పి ఏకంగా అప్పటి పోలీసు అధికారులు శాంతిపురం మండలంలో సిఎం చంద్రబాబునాయుడును అడ్డుకోవడంతో పాటు దేశం శ్రేణులపై కేసులు నమోదు చేశారు. దీంతో పాటు పోలీస్‌స్టేషన్ల ఎదుట నిరసనలు, ధర్నాలు, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే కేసులు నమోదు చేయడంతో పాటు అప్పట్లో పలువురు నేతలను రిమాండ్‌కు సైతం తరలించారు. ఐదేళ్ల వైకాపా పాలనలో గతంలో ఎన్నడూలేని విధంగా కుప్పం నియోజకవర్గంలో పోలీసు కేసులను దేశం శ్రేణులు ఎదుర్కోవాల్సి వచ్చింది. కేసులతో పాటు కొందరిపై రౌడీషీట్లు సైతం పోలీసు అధికారులు తెరిచారు. ఈనేపథ్యంలో సిఎం చంద్రబాబునాయుడు ఇటీవల కుప్పం పర్యటనలో భాగంగా వైఎస్సార్సీ పాలనలో దేశం శ్రేణులపై నమోదైన రాజకీయ ప్రేరేపిత రౌడీషీట్లు ఎత్తివేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. వీటితో పాటు దేశం శ్రేణులపై నమోదైన అక్రమ కేసులు సైతం ఎత్తివేయనున్న నేపథ్యంలో నియోజకవర్గంలో కేసులు ఎదుర్కొంటున్న దేశం శ్రేణులు ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో తమపై ఉన్న కేసుల వివరాలను సేకరించి పార్టీ అధిష్టానానికి పంపించేందుకు సిద్ధమయ్యారు. మండలాల వారీగా నేతలు తమపై ఉన్న పోలీసు కేసుల వివరాలను సేకరిస్తున్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ మణికంఠ చందోలు



చిత్తూరు, జూన్ 29 ప్రభాతవార్త: కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను శనివారం ఎస్పీ మణికంఠ చందోలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. కలెక్టర్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే జిల్లాకు ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు రావడంతో బిజీ అయ్యారు. ఈ క్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఎస్పీ మణికంఠ చందోలు ప్రత్యేకంగా కలవలేకపోయారు. ఈ పరిస్థితుల్లో శనివారం ఎస్పీ మణికంఠ చందోలు కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌కు వచ్చి కలెక్టర్ సుమిత కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

**కలెక్టర్‌ను కలిసిన అడ్మిన్ ఎఎస్పీ ఆరీఫుల్లా:**

కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను శనివారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో అడ్మిన్ ఎఎస్పీ ఆరీఫుల్లా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. కలెక్టర్‌గా సుమిత్‌కుమార్ బాధ్యతలు స్వీకరించి బిజీ షెడ్యూల్‌లో వుండటంతో అడ్మిన్ ఎఎస్పీ ఆరీఫుల్లా శనివారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

## పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు

**-రాష్ట్రకార్యదర్శి పుష్పావతియాదవ్‌తో మంత్రి లోకేశ్**



తిరుపతి,జూన్ 29ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైందని...సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని యువనేత,రాష్ట్రమంత్రి నారా లోకేశ్ తెలిపారు. ప్రజలతో ఇంకా మమేకమై ,పార్టీని మరింత బలోపేతం చేసుకునేందుకు ,ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా పనిచేయాలని లోకేశ్ కోరారు. ప్రభుత్వం ప్రజల భాగస్వామ్యం కోరుకుంటోందని, టిడిపి నేతలు కూడా అందులో భాగస్వాములై పూర్తిస్థాయిలో సహకారమందించాలని ఆయన రాష్ట్ర కార్యదర్శి వి.పుష్పావతియాదవ్‌కు నిర్దేశం చేశారు. పార్టీ సభ్యత్వ నమోదు, ప్రజలకు మంచి కార్యక్రమాలు చేపట్టడంలో తిరుపతి జిల్లాలో తిరుపతిలో మీ భాగస్వామ్యం అవసరమని ఆయన కోరారు. రాష్ట్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారాలోకేశ్‌ను శనివారం అమరావతిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## పెన్షన్ల పంపిణీ పారదర్శకంగా చేపట్టండి : ఎమ్మెల్యే

పలమనేరు,జూన్ 29,ప్రభాతవార్త: పెన్షనుల పంపిణీ పారదర్శకంగా జరగాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అధికారులకు సూచించారు.స్థానిక కార్యాలయంలో శనివారం జరిగిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జూలై 1 చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పెన్షనుల పంపిణీ పారదర్శకంగా జరగాలని అధికారులకు సూచించారు.ఎన్నికలకు ముందు పెన్షన్లు పెంపుచేపడుతామని ఇచ్చిన హామీ మేరకు రూ.3వేల నుండి రూ.4వేలకు,దివ్యాంగులకు రూ.6వేలుగా పెంచి అందించడంతో పాటు,హామీ ఇచ్చిన నాటి నుండి గడిచిన మూడు నెలలకు సంబందించిన మిగులు పెన్షనుతో కలిపి రూ.7వేలు అందించడం గొప్పవిషయమన్నారు.అనంతరం పట్టణ పరిధిలో జూలై నెలలో 4682 మంది లబ్ధిదారులకు సుమారు రూ.3.20కోట్లు పంపిణీ చేయాల్సి ఉంటుందని మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు.నియోజకవర్గంలో పెన్షన్ల పంపిణీ పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఆధికారులకు ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు,టిడిపి నాయకులు ఆర్వి బాలాజీ,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చాంద్ బాషా,ఖాజాఫీర్,మాభాషా తదితరులు పాల్గొన్నారు.

## దొంగలించబడ్డ సొత్తు లభ్యం



రాజనాబండ(చౌడేపల్లి), జూన్ 29 ప్రభాతవార్త : ఇంట్లో దొంగలించబడ్డ సొత్తు రాజనాలబండ మహిమతో లభ్యమైన సంఘటన శనివారం వెలుగు చూసింది. కర్ణాటకరాష్ట్రం సోమయాజులపల్లి భాస్కర్ ఇంట్లో 20రోజుల క్రితం 25గ్రాముల బంగారం దొంగలించబడింది. దీంతో బాధితుడు చుట్టుపక్కల విచారించినా ప్రయోజనం కనబడకపోవడంతో రాజనాలబండ సత్యప్రమాణాల మహిమను తెలుసుకొని ఇక్కడి వచ్చాడు. అనుమానితులను బండకు తీసుకురావాలని నిర్వాహకులు తెలపడంతో అతను సొంత గ్రామానికి వెళ్ళి జరిగిన ఉదంతాన్ని అనుమానితులకు తెలిపి ప్రమాణానికి రావాలని తెలిపాడు. దీంతో అనుమానితుల్లో ఒకరు బంగారాన్ని ఎవరికీ తెలియకుండా భాస్కర్ ఇంట్లో పడేశాడు. రాజనాలబండ ప్రసన్న ఆంజనేయస్వామి మహిమతోనే తన బంగారం లభ్యమైందని బండకు వచ్చి విశేష పూజలు చేసాడు.

## బాడీ బిల్డర్ అభిలాషకు ఘన సన్మానం

**అభిలాష్ అందరికీ ఆదర్శం-సిడబ్ల్యూఎం దైవసహాయం**



రేణిగుంట, జూన్ 29 ప్రభాతవార్త : రేణిగుంట సిఆర్ఎస్‌లో ఉద్యోగం చేసుకుంటూ స్వయం కృషితో జాతీయ స్థాయిలో బాడీ బిల్డింగ్ నందు గోల్డ్ మెడల్ సాధించిన అభిలాషను సిఆర్ఎస్ అధికారులు రైల్వే ఉద్యోగులు, వివిధ యూనియన్ నేతలు అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. దేశ రాజధాని న్యూఢిల్లీ షా స్టేడియం నందు జూన్ 23వ తేది ఆదివారం వరల్డ్ ఫిట్నెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 60 కేజీల కేటగిరి నందు నేషనల్ గోల్డ్ మెడల్‌ను అందుకున్నారు. ఆయనను శనివారం సిఆర్ఎస్ సమీపంలోని రైల్వే ఇన్స్టిట్యూట్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యాన అభినందన సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. సందర్భంగా అభిలాష మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో గోల్డ్ మెడలు సాధించడమే తన ధ్యేయం అన్నారు. తన విజయం వెనుక తన జీవిత భాగస్వామి, సాటి ఉద్యోగుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. స్పోర్ట్స్ క్లబ్ ద్వారా 10000 రైల్వే యూనిట్ 2000, రైల్వే సంఘ 2000 రూపాయిలు నగదు పారితోషికంగా అందజేశారు. అభిలాషను సన్మానించిన వారిలో సిడబ్ల్యూఎం దైవ సహాయం, డిప్యూటీ సిఎంఇ విజయకుమార్, డిప్యూటీ సిఎంఎం సత్య ప్రకాష్, ఏడబ్ల్యూఎవో గోపాల్ నాయక్, సీనియర్ డిఎంఇ నరసింహ నిశాంత్, పిఈ ఉమాకాంత్, పలువురు కార్మికులు, ఉద్యోగులు, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

## భారత్ క్రికెట్ టీంకు ఆల్ ద బెస్ట్



గూడూరు, జూన్ 29 ప్రభాతవార్త : గూడూరులోని ఆదిశంకర పాఠశాల విద్యార్థులు శనివారం భారతదేశ సౌతాఫ్రికా క్రికెట్ టీంతో ఫైనల్ మ్యాచ్ ఆడుతున్న సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల విద్యార్థులు ఆల్ ద బెస్ట్ ఆకారంలో ఏర్పడి భారత్ క్రికెట్ టీంటి 20 ప్రపంచ కప్‌ను గెలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రూపవతి మాట్లాడుతూ జరిగే టి 20 ప్రపంచ కప్ ఫైనల్‌లో సౌత్ ఆఫ్రికా పై భారతదేశం గెలిచి భారతదేశం త్రివర్ణపతాకం ప్రపంచ పట్టం పైన మరోసారి వెలగాలని ఆకాంక్షించారు. విద్యార్థులందరూ భారత్ క్రికెట్ టీంకు ఆల్ ద బెస్ట్ తెలియజేశారు. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్, కోహ్లీ భారత ఆటగాళ్లందరూ బాగా ఆడి భారతదేశానికి టి 20 ప్రపంచ కప్ తీసుకురావాలని 140 కోట్ల భారతీయుల కలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జున, ప్రశాంత్, పాఠశాల పిఈటి మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్‌వి యస్ మూర్తికి ఇఓ బాధ్యతలు

శ్రీకాళహస్తి,జూన్ 29 ప్రభాతవార్త :శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారిగా పని చేస్తున్న ఎస్‌వి నాగేశ్వరరావు ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్నారు.ఆయన స్థానంలో పూర్తి అదనపు బాధ్యతలను తిరుపతి దేవాదాయశాఖకు చెందిన ఆర్‌జెసి ఎన్‌వియస్‌మూర్తికి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది.ఈమేరకు శనివారం ఇక్కడకు సమాచారం అందింది.శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓగా ఎస్‌వి నాగేశ్వరరావు డెప్యూటీ కలెక్టర్ కావటంతో ఆర్నెల్లు పని చేసారు.ఆయన ఉద్యోగ విరమణ చేయనుండటంతో రెగ్యూలర్ ఇఓ నియామకం జరిగే వరకు అదనపు పూర్తి బాధ్యతలను తిరుపతి దేవాదాయశాఖ ఆర్‌జెసి ఎన్‌వియస్‌మూర్తికి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. ఆదివారం నాగేశ్వరరావు నిరాడంబరంగా ఉద్యోగ విరమణ చేయనున్నారు.ఎన్‌వియస్‌మూర్తి ఇటీవల జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా పని చేసారు.

## తిరుచ్చి వాహనంపై "శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న"



చంద్రగిరి, జూన్ 29 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాది నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయం త్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవ మూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్ తేనెపల్లి వెంకట స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుబట్లు ధనశేఖర్, అర్చకులు కె.నరశింహాచారి, ఘనాపాటి తిరువెంగడం, సిబ్బంది చెంగయ్య, సెక్యూరిటీ నవీన్, డాక్టర్ ఉదయ్‌తేజ, జమేధర్ జలంధర్, తదితరులు పాల్గొన్నారు.

## కాలువలపై ఆక్రమణలు తొలగించి పూడిక తీయండి:కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జూన్ 29 ప్రభాతవార్త :తిరుపతి నగరంలోని కాలువలపై ఆక్రమణలను తొలగించి పూడిక తీసే పనులు వేగవంతం చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్ ఆదేశాలు జారీ చేసారు. తిరుపతి నగరంలోని వివి మహల్ రోడ్డు, భవానీ నగర్, రైల్వే కాలనీ, సాయిరామ్ వీధి ప్రాంతాల్లో శనివారం విస్తృతంగా కమిషనర్ పర్యటించి శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. వివి మహల్ రోడ్డుకు ఇరువైపుల వెలుతున్న ప్రధాన కాలువలపై ఆక్రమణలు తొలగించి, అటు తరువాత పూర్తి స్థాయిలో సిల్ట్ తొలగించి, ఎలాంటి ఆటంకాలు రాకుండా కాలువల్లోని మురికి నీరు ప్రవహించేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. దేవేంద్ర థియేటర్ ప్రక్కన వెలుతున్న ప్రధాన కాలువలో కేబుల్ వైర్లు, ఇతర పైప్ లైన్లు మురుగు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండడం గమనించి వాటినన్నింటిని క్రమబద్ధీకరించి మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా కాలువలపై ఆక్రమణలు నిర్మించుకోవడమే కాకుండా వ్యర్థాలను నేరుగా కాలువల్లోకి వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలన్నారు. తిరుపతి పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని, నగర పరిశుభ్రతకు అందరం కలిసి శ్రమిద్దామని ఈ సందర్భంగా కమిషనర్ అధితి సింగ్ ప్రజలనుద్దేశించి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈ శ్రావణి, శానిటరి సూపర్‌వైజర్ చెంచెయ్య పాల్గొన్నారు.

## టమోటా ధర కట్టడికి మొబైల్ వాహనాల ద్వారా విక్రయాలు

**- రైతు బజార్ ప్రత్యేక కౌంటర్‌లో రూ.165కే కేజీ నాణ్యమైన కందిపప్పు**

**- ధరల నియంత్రణ కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు**



చిత్తూరు, జూన్ 29 ప్రభాతవార్త: జిల్లాలో పలు ప్రాంతాల్లో పెరిగిన టమోటా ధరను కట్టడి చేయడానికి ఆ ప్రాంతాల్లో ప్రత్యేక మొబైల్ వాహనాల ద్వారా టమోటా తక్కువ ధరకే విక్రయాలు చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో శనివారం జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధ్యక్షతన ధరల నియంత్రణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పెనుమూరు, కార్వేటినగరం, జిడినెల్లూరు, నగరి తదితర మండలాల్లో టమోటా ధరలను నియంత్రించడానికి ఇక్కడ ప్రత్యేక మొబైల్ వాహనాల ద్వారా తక్కువ ధరలకు టమోటా ప్రజలకు అందించేలా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అలాగే జిల్లాలో కందిపప్పు ధరను నియంత్రించడానికి చిత్తూరు రైతు బజారులో ఏర్పాటు చేసే ప్రత్యేక కౌంటర్‌లో ఒక కేజీ నాణ్యమైన కందిపప్పు రూ.165కే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పౌరసరఫరాల శాఖ అధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. చిత్తూరు రైతు బజారులో కందిపప్పు విక్రయ ప్రత్యేక కౌంటర్ మంగళవారం ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే పప్పుధాన్యాల హోల్ సేల్ డీలర్లు సైతం చిత్తూరు పాత మార్కెట్ వీధిలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి తక్కువ ధరకు పప్పులు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శంకరన్, సివిల్ సప్లై డిఎం మోహన్‌బాబు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, మార్కెటింగ్ ఎడి పరమేశ్వరన్, పప్పుధాన్యాల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## భజనలతో వేడుకగా నగరసంకీర్తన

తిరుపతి,జూన్ 29ప్రభాతవార్త: ఆధ్యాత్మికనగరం తిరుపతిలో ప్రతి శనివారం రాయలసీమ రంగస్థలి నిర్వహించే నగరసంకీర్తన శనివారం ఉదయం భక్తిభావాన్ని చాటింది. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ఆద్వర్యంలో కళాకారులు, భజనమండలి సభ్యులు నుదుటిన తిరునామం ధరించి, భజనలు చేసుకుంటూ నగరంలో గోవిందనామంతో హోరెత్తించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో సురేష్‌స్వామి,తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, డిపి ఆనంద్,వాసు, కొండె చంగారెడ్డి,విజయలక్ష్మి, వాసుదేవరెడ్డి,శాంతి ,భజనకళాకారులు తదితరులు పాల్గొన్నారు.



## రాజీవ్ నగర్‌లో కనకవర్షం కురిపించిన ఎంజాయ్‌మెంట్ సర్టిఫికేట్లు



శ్రీకాళహస్తి,జూన్ 29 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్‌లో కరెంటు మీటర్లు కనెక్షన్లు దరఖాస్తులు రెవెన్యూశాఖకు కనకవర్షం కురిపించింది.అయితే ప్రభుత్వం మారినా పాలకులు మారినా అధికారుల తీరులో మాత్రం మార్పు రావటం లేదు. రాజీవ్‌నగర్‌లో నిజమైన లబ్దిదారులు సర్టిఫికేట్ కోసం దరఖాస్తులు చేసుకొని కార్యాలయం చుట్టు తిరుగుతున్న వారి సంఖ్య వందల్లో ఉంది.ఇక్కడి కార్యాలయంలో వసూల్ రాజాగా ఆర్ఐ వ్యవహరిస్తున్నట్లు విమర్శలు,ఆరోపణలు చోటు చేసుకున్నాయి. శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్‌లో కరెంటు కనెక్షన్ కావాలంటే విద్యుత్‌శాఖ రెవెన్యూశాఖ సర్టిపికేట్ ముడిపెట్టారు. దాంతో ఇక్కడ విద్యుత్ కనెక్షన్ కోరుకున్న వారు రెవెన్యూ,విద్యుత్‌శాఖలకు చేయి తడపనిదే కాగితం ముక్క చేతికందదు.రెవెన్యూశాఖలో కాగితం కావాలంటే మొదట విఆర్ఓ ధృవీకరి ంచాలి. ఆయన చుట్టూ ప్రదక్షిణలు చేస్తే తప్ప ఆయన దొరకరు.ఎలాగోలాగ ఆయనను పట్టుకుంటే ఆయన చేయి తడపనిదే కాగితం కదలదు. ఆ కాగితాన్ని చేతబట్టుకొని రెవెన్యూ కార్యాలయానికి వెళితే ఇక అక్కడ 'రాజ్యాంగేతర అధికారి' రెవెన్యూ ఇన్స్పెక్టర్. ఆయనను సాక్షాత్కరించుకోవాలంటే కార్యాలయం చుట్టూ ఎన్ని రోజులు తిరగాలో బాధలు పడ్డ లబ్దిదారులకే ఎరుక. ఇక ఆయన ప్రసన్నం అయితే అక్కడ నుంచి రేటుపై చర్చలు.

**నిరుపేదలు చక్కర్లు కొడుతుంటే కాలువ పొరంబోకులకు :**

రాజీవ్‌నగర్‌లో నిజమైన లబ్దిదారులు ఎంజాయ్‌మెంట్ ధృవీకరణ కోసం నెలల తరబడి ప్రదక్షిణలు చేస్తుంటే ఎంచక్కా కాలువ పొరంబోకులు,రోడ్డు పొరంబోకులకు ఎంచక్కా సర్టిఫికేట్లుతో విద్యుత్ మీటర్ కనెక్షన్లు పొందిన సంఘటనలు పరిశీలిస్తే రెవెన్యూ ఇన్స్పెక్టర్ పరిస్తితి అర్థమౌతుంది.రెవెన్యూ కార్యాల యంలో ఆర్ఐను ప్రసన్నం చేసుకోనిదే తహశీల్దార్ దర్శన భాగ్యం లభించదు.శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలో రాజీవ్ నగర్ కనకవర్షం కురిపించిందని చెప్పవచ్చు.విద్యుత్‌శాఖ అధికారులు మాత్రం రెవెన్యూ నుంచి సర్టిపికేట్ అందితే ఇక వారి వ్యాపారం వారు సరిచూసుకుంటున్నారు.వారి రేట్ ప్రకారం లైన్ మెన్‌కు సమర్పించు కుంటే విద్యుత్ వెలుగులు అందుతున్నాయి. నిరుపేదలు తమ బాధలను విన్నవించుకొనుటకు తహశీల్దార్‌ను కలుసుకోవాలంటే గేట్ దాటనివ్వని సిబ్బంది. వివరణ కోరటానికి ప్రయత్నించినా తహశీల్దార్ చరవాణి తీయరు.

**విచారణ జరిపిస్తా: ఆర్‌డిఓ**

శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్‌లో విద్యుత్ కనెక్షన్స్ కోసం విద్యుత్, రెవెన్యూశాఖలు పాలకుల అదేశాలతో ప్రత్యేకంగా రూపొందించుకున్న నిబంధనలు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభాతవార్త శ్రీకాళహస్తి ఆర్‌డిఓ రవిశంకర్‌రెడ్డి దృష్టికి తెచ్చి వివరణ కోరగా ఈ ఆరోపణలు తన దృష్టికి రాలేదని నిరుపేదల సమస్యలకు సంబంధించి విచారణ జరిపిస్తామన్నారు.నిజమైన నిరుపేదలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

## ఆక్రమణలకు అడ్డాగా ఆర్‌అండ్‌బి రోడ్డు

**- సూళ్లూరుపేటలో యథేచ్ఛగా ఆక్రమణలు**




సూళ్లూరుపేట, జూన్ 29 ప్రభాతవార్త : హోలీక్రాస్ జంక్షన్ నుంచి సూళ్లూరుపేట పట్టణంలోకి ప్రవేశించి లలితా జ్యూయలరీ వరకు ఉన్న ఆర్‌అండ్‌బి రోడ్డు ఆక్రమణలకు అడ్డాగా మారిపోయింది. ఆక్రమణదారులు యథేచ్ఛగా రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించడంతో పాటు ఏకంగా రోడ్డుపైనే అంగళ్లు పెడుతున్నారు. తోపుడు బండ్లు, ఆటోలు, బస్సులు సైతం రోడ్డుపైనే నిలిపేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 2001 సంవత్సరంలో చిన్నపాటి ఆర్‌అండ్‌బి రోడ్డును విస్తరించి అప్పుడు ఇరువైపులా ఫుట్‌పాత్‌లతో పాటు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రోడ్డు అభివృద్ధి చేయడం అంతంతమాత్రంగానే ఉండి ప్రస్తుతం గుంతలమయంగా మారింది. దీనికి తగ్గట్టుగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను, సమీపంలోని డ్రైనేజీ కాలువలను సైతం ఆక్రమణదారులు యథేచ్ఛగా ఆక్రమించేశారు. శాశ్వత నిర్మాణాలు చేసుకోవడంతో పాటు బంకులు ఏర్పాటు చేసుకొని తమ వ్యాపారాలు నిర్విఘ్నంగా చేసుకుంటున్నారు. కొందరు ఏకంగా బంకులకు చిన్నచిన్న షెడ్లు వేసి, ఆ షెడ్లకు బాడుగలు సైతం వసూలు చేసుకుంటున్నారు. గత సంవత్సరం ఇక్కడ పనిచేసిన సీఐ వెంకటేశ్వర్లురెడ్డి కొన్నిరోజులు మాత్రం వీటిని క్రమబద్ధీకరించేందుకు చొరవ తీసుకొని కొంతవరకు ఈ ఆక్రమణలను తొలగించగలిగారు. తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో తిరిగి యథావిధిగా ఆక్రమణలు చోటుచేసుకుంటు న్నాయి. అటు ఆర్‌అండ్‌బి యంత్రాంగం గాని, మున్సిపల్ పాలకమండలి గాని ఈ విషయమై పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చిన్నపాటి వర్షం వచ్చినా ఆక్రమణల పుణ్యమా అని డ్రైనేజీలోకి వర్షపు నీరు వెళ్లకుండా రోడ్లపై నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడుతున్నారు. నూతనంగా ఎమ్మెల్యేగా గెలిచిన నెలవల విజయశ్రీ ఈ విషయమై చొరవ తీసుకొని సూళ్లూరుపేట పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఆక్రమణలు తొలగించి, రోడ్డును బాగు చేస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.